క్లుప్తంగా

విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరం



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరంగా మారనున్నట్లు స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వేమన పద్యాలు కంఠస్థం చేయించడం, స్పోకెన్ ఇంగ్లిష్, జీకే, గణితం, భరత నాట్యం తదితర అంశాల్లోని మెలకువలను వివరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానం, విజ్ఞానం కోసం పుస్తకాలను చదవాలని సూచించారు. వేసవిలో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న ముఖ్య ఉద్దేశంతో చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విజయం ప్రతిభ



శ్రేయా జాగృతి

చిత్తూరు కలెక్టరేట్ : నగర పరిధిలోని సుందరరాజపురంలో ఉన్న విజయం సీబీఎస్ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదలైన సీబీఎస్ఈ ఫలితాల్లో ఆ పాఠశాల విద్యార్థులు సాధించిన ఫలితాలను ఆయన వెల్లడించారు. 12వ తరగతిలో జాగృతి 465 మార్కులు, భవ్యశ్రీ 417, యోషికా 406, కీర్తనా 405, 10వ తరగతిలో శ్రేయా 570, సుహానాఖాన్ 564, దినేష్‌రాజ్ 555, ప్రేమశ్రీ 545, చాణక్య 536 మార్కులు సాధించారన్నారు. అనంతరం ఆ విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ శైలజా అభినందించారు.

వరదరాజుల స్వామి గ్రామోత్సవం



అభిషేక పూజలు చేస్తున్న వేద పండితులు

కాణిపాకం: చిత్ర పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైనా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజు స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రధాన ఆలయం స్వామి వారి పుష్కరిణిలో వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో పెంచల కిషోర్, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

సత్యమ్మా.. వర్షాలు కురిపించమ్మా



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: వర్షాలు కురిపించి, పంటలు బాగా పండేలా దీవించాలని కోరుతూ మంగళవారం మండలంలోని బసవాపల్లె గ్రామస్తులు సత్యమ్మ దేవతకు పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలిపోసి, పొంగళ్లపెట్టి ప్రత్యేకంగా అలంకరించి భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం అభిషేకం చేశారు. భక్తులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మట్టి కుండలకు భలే డిమాండ్



వేసవిలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. కుండ ధర ప్రస్తుతం రూ.250 పలుకుతోంది. తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరల పెరుగుదలలో భాగంగా కుండ ధరలు కూడా బాగానే పెరిగాయి. గుడిపాల మండలంలో తయారుచేసే ఎర్రమట్టి కుండలకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తూ చిత్తూరుకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. - గుడిపాల

నడివీధిలో కొలువుదీరిన గంగమ్మకు తొలిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సీకేబాబు



సంతపేటలో కొలువుదీరిన అమ్మవారు



గిరింపేటలోని గంగమ్మ తల్లి



దొడ్డిపల్లిలో కొలువుదీరిన అమ్మవారు



కట్టమంచిలోని అమ్మవారు



గంగరంగ వైభవం

చిత్తూరులో గంగజాతర కోలాహలంగా ఆరంభమైంది. అమ్మవారి మండపాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచే ఉక్కపోతతోపాటు భక్తుల తాకిడి మొదలైంది. మండే ఎండలను లెక్క చేయకుండా భక్తులందరూ అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. నడివీధిలో కొలువుదీరిన గంగమ్మ తల్లి భక్తజనులకు జగజ్జననిగా కటాక్షించింది. భక్తజనంతో విశేష పూజలందుకుంది. భక్తులు చీరలు, అంబలి, కుంభాలను సమర్పించడంతో శక్తి స్వరూపిణి శాంతించింది. భక్తుల కోర్కెలను తీర్చే కొంగు బంగారు తల్లిగా విరాజిల్లుతూ పూజలందుకుంటోంది. భక్తిభావం చాటుతూ నిలువు దోపిడీతో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

- చిత్తూరులో మొదలైన గంగ జాతర
- నడివీధిలో కొలువుదీరిన అమ్మవారు
- నైవేద్య సమర్పణ, విశేష పూజల్లో భక్తులు
- మండపాల వద్ద భక్తజన సంద్రం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలో మంగళవారం గంగజాతర అట్టహాసంగా ప్రారంభమైంది. నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అమ్మవార్లను ప్రతిష్ఠించారు. తొలిపూజ చేసి జాతర ఘట్టాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున 4 గంటల సమయంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సీకే బాబు కుటుంబ సభ్యులు స్థానిక బజారువీధిలో ప్రతిష్ఠించిన నడివీధి గంగమ్మకు తొలిపూజను ప్రారంభించారు. తెరను తొలగించి లాంఛనంగా జాతరకు శ్రీకారం చుట్టారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన అంబలిని నైవేద్యంగా సమర్పించారు. విచిత్ర వేషధారణలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు వస్తు, ధన రూపేణ కానుకలు సమర్పించుకున్నారు. ఈ క్రమంలో బజారు వీధి భక్తులతో కిక్కిరిసిపోయింది. కట్టమంచిలో జాతర పెద్దలు గంగమ్మ శిరస్సును సింహవాహనంపై కొలువుదీర్చారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సంతపేటలో ఉదయం 7 గంటలకు తొలిపూజ పూర్తయింది. మహిళలు వేపాకు తోరణాలు కట్టిన పాత్రలో అంబలి తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యమిచ్చారు. దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, గిరింపేట, ఓబన్నపల్లి, మంగసముద్రం తదితర ప్రాంతాల్లో అమ్మవారిని కొలువుదీర్చారు. ఉదయం అంబలి, రాత్రి కుంభం పోశారు. విశేష పూజలు చేసి భక్తులకు హారతి సమర్పించారు. పలుచోట్ల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

సేవ కార్యక్రమాలు

జాతర సందర్భంగా మండుటెండను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, శీతలపానీయాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనేక మంది అన్నదానాలు, మరి కొందరు అమ్మవారి నైవేద్యాన్ని పంపిణీ చేశారు. చాలా మంది భక్తులు పలు రకాల వేషాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.



సంతపేటలోని అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

గంగజాతర మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా స్థానిక పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. మండపాల వద్ద నిఘాను పటిష్టం చేశారు. సీసీ కెమెరాల ద్వారా అనుమానిత వ్యక్తుల కదలికలపై పర్యవేక్షిస్తున్నారు. అన్ని మండపాలను పోలీసులు పూర్తి స్థాయిలో చుట్టుముట్టేశారు. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్‌ను మళ్లించి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూశారు.



అంబలి తీసుకొస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి



అమ్మవారికి అంబలి తీసుకొస్తున్న ఓ మహిళ











గిరింపేటలోని అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, వివిధ రకాల వేషధారణల్లో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు, వేపాకులు ధరించి మొక్కు చెల్లించుకునేందుకు వస్తున్న భక్తురాలు, గిరింపేటలో అంబలి సమర్పిస్తున్న భక్తులు

పల్లెల్లో గంగ జాతర సందడి





తవణంపల్లెలో కొలువైన గంగమ్మ తల్లి, దిగువ తడకరలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో గంగ జాతర సందడితో ప్రజలు భక్తిపారవశ్యంలోఅలరారుతున్నారు. మండలకేంద్రమైన తవణంపల్లె, టి.పుత్తూరు, దిగువ తడకరలో గంగ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో గంగమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. తవణంపల్లె, టి.పుత్తూరు, దిగువ తడకరలో గ్రామ దేవత సత్యమ్మకు భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పొంగళ్లు, అంబలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దిగువ తడకరలో జాతర సందర్భంగా అమ్మ వారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాంధీబాబు, నాయకులు భూపతినాయుడు, మధుకుమార్, మురుగన్, చిట్టిబాబు,పట్టాభిరెడ్డి, ఎగువ తవణంపల్లె సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు యుగంధర్ రెడ్డి, ఎంపీటీసీ ఇందిర తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

నిఘా నీడలో నగరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పలు చోట్ల జరుగుతున్న గంగజాతరను పోలీసులు నిఘా నేత్రంలో పర్యవేక్షిస్తున్నారు. ఇందుకు సంబంధించి గాంధీ సర్కిల్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధి వద్ద జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. ఎప్పుడు ఏం జరిగినా వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. అల్లర్లు, చోరీలు, గొడవలను పసిగట్టి నియంత్రణకు ఈ నిఘా నేత్రాన్ని పకడ్బందీగా నిర్వర్తిస్తున్నారు.

వైభవంగా బకాసుర బలిబండి

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో మంగళవారం బకాసుర బలిబండిని వైభవంగా నిర్వహించారు. బకాసురుడికి ఆహారం తీసుకొని వెళ్లడానికి భీముడు గ్రామాల్లో తిరిగి వివిధ రకాల వంటలను సేకరించాడు. గ్రామాల్లోని ప్రజలు బండికి పూజలు చేసి వివిధ రకాల వంటకాలను బండిలో వచ్చిన భీముడికి అందజేశారు. కళాకారులు కమలాపతి, చందు భీముడి వేషధారణ ఆకట్టుకొంది. రాత్రి నాటకాన్ని శ్రీ వెంకటేశ్వర నాట్యమండలిచే బకాసుర వధ అద్భుతంగా ప్రదర్శించారు. బుధవారం రాత్రి ద్రౌపదీ స్వయంవరం నాటకాన్ని ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.



బలిబండిపై గ్రామాల్లో పర్యటిస్తున్న భీముడు

డయేరియాపై అశ్రద్ధ వద్దు

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అతిసారం (డయేరియా)పై అశ్రద్ధ వహించకుండా అవగాహన పెంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని పాలకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ వర్షాలకు కలుషితమైన నీటిని తాగడం వలన డయేరియాతో జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. మురుగునీటి నిల్వలు, పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. డయేరియా బారిన పడిన రోగులకు హెల్త్ క్లినిక్‌లు, సబ్ సెంటర్లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

మండల సమావేశం రేపు

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు హాజరు కావాలని ఆయన కోరారు.

సామాజిక ఆర్థిక సర్వే



అవగాహన ర్యాలీలో విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో ఎస్వీ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రామంలో సామాజిక ఆర్థిక సర్వే చేపట్టారు. రైతులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించారు. రైతులు విద్యార్థులకు వారి వ్యయసాయ, ఆర్థిక పరమైన పూర్తి సమాచారాన్ని వివరించారు. అనంతరం రైతులకు వివిధ వ్యవసాయ సంబంధిత యాప్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ నిర్వాహకులు శైలజ, ప్రశాంతి పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. పాపసముద్రంలో మంగళవారం ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యం చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, గిరిజ, బుజ్జమ్మ, ప్రభావతి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో విశ్రాంతి అవసరం

తవణంపల్లె: వృద్ధాప్యంలో బాగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని మైనగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులను పరీక్షించారు. గర్భవతులు, బాలింతలతో పాటు బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వృద్ధులు ఈ వేసవిలో వడదెబ్బ తగలకుండా ఇంటిలోనే విశ్రాంతి తీసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు. మండలంలోని సరకల్లులో డాక్టర్ మోహనవేలు 35 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



సరకల్లులో మహిళలకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు